క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే జోగులుకు వినతిపత్రం అందజేస్తున్న శానిటరీ సెక్రటరీలు

రాజాం: జీవో నంబర్‌–650 ప్రకారం జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాల రిజిస్ట్రేషన్‌ బాధ్యత తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని వార్డు సచివాలయాల శానిటరీ అండ్‌ ఎన్విరాన్‌మెంట్‌ సెక్రటరీలు కోరుతున్నారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలో ఎమ్మెల్యే కంబాల జోగులును ఆదివారం కలిసి, వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో విధిగా పారిశుద్ధ్య పనులు, ప్రజారోగ్య కార్యక్రమాలు చేయిస్తున్నామని, అయితే 650 జీవో ప్రకారం జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాల రిజిస్ట్రేషన్‌ కూడా తామే చేయాల్సి ఉండగా, ఆ అధికారాలు ఇక్కడ బదిలీ కాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి, సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



మెంతిపేట కాలనీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

రాజాం: పట్టణంలోని అమ్మవారి కాలనీ, వస్త్రపురి కాలనీ, మెంతిపేట, చాకలి వీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ఆదివారం చాలా చురుగ్గా చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ ప్రసాద్‌ పర్యవేక్షణలో పారిశుద్ధ్య సిబ్బంది మురుగు కాలువలపై ఉన్న మూతలు తొలగించి, చెత్తాచెదారాన్ని బయటకు తీశారు. వాటిని ట్రాక్టర్లు, రిక్షాల ద్వారా డంపింగ్‌యార్డులకు తరలించారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

రాజాం: స్థానిక అప్సర థియేటర్‌ సమీపంలో బాబానగర్‌ శివం సత్యసాయి భక్తులు మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అటువైపుగా వెళ్లే వారికి నిర్వాహకులు గ్లాసులతో మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

విత్తన రిజిస్ట్రేషన్లు ప్రారంభం



విత్తన రిజిస్ట్రేషన్‌ ప్రక్రియను ప్రారంభిస్తున్న ఏఓ రేణుకాసాయి

రాజాం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఖరీఫ్‌ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. విత్తనాలు కావాల్సిన రైతులంతా ఆధార్‌ కార్డుతో ఆర్‌బీకేల వద్దకు వచ్చి, పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎ.రేణుకాసాయి సూచించారు. ఆదివారం మండలంలోని దోసరి గ్రామ ఆర్‌బీకే వద్ద ఆమె ఈ విత్తన రిజిస్ట్రేషన్‌ ప్రక్రియను ప్రారంభించి, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కరణం తులసీనాయుడు, రైతులు పాల్గొన్నారు.

భగవన్నామస్మరణతోనే మోక్షం



ఆధ్యాత్మిక జ్ఞాన బోధ సభలో పాల్గొన్న ఆధ్యాత్మిక వక్తలు

రేగిడి: భగవంతుని నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని ఆధ్యాత్మిక వక్తలు ఎన్వీ రమణ జడ్డు జగ్గారావు, రామశేషు తెలిపారు. చైత్ర పౌర్ణమి పురస్కరించుకుని, స్థానిక దత్త పీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యంనాయుడు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక జ్ఞాన బోధ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుడిని నిత్యం స్మరించుకోవాలని, అలా చేస్తే పాపాలు పోతాయని, దుఃఖాలు దరిచేరవన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, అందరూ ఆధ్యాత్మికత వైపు పయనించాలని కోరారు.దత్తపీఠం కన్వీనర్‌ ఆర్‌.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాడంగి తహసీల్దార్‌గా అజీజ్‌ రఫీ

బాడంగి: తహసీల్దార్‌గా మహమ్మద్‌ అజీజ్‌ రఫీ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్వర్వులు వెలువడగా, సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

నిషేధమా.. నీ జాడెక్కడ?

- కానరాని పాలిథిన్‌ నిషేధం
- యథేచ్ఛగా నిషేధిత పాలిథిన్‌, ప్లాస్టిక్‌ కవర్ల వినియోగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- కాలుష్యం బారిన వాతావరణం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

రాజాం సిటీ : ప్లాస్టిక్‌ రహిత సమాజమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పాలిథిన్‌, ప్లాస్టిక్‌ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించింది. దీన్ని అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం అంతగా పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా నిషేధిత పాలిథిన్‌, ప్లాస్టిక్‌ కవర్ల వినియోగం పెరిగిపోయింది. గతేడాది నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ నిషేధానికి చర్యలు తీసుకోగా, అప్పట్లో అధికారులు సైతం చర్యలు చేపట్టినా ఇప్పుడు అవి తూతూమంత్రంగానే మారాయి. దీంతో ప్రభుత్వ ఆశయానికి గండిపడింది. పాలిథిన్‌, ప్లాస్టిక్‌ కవర్ల నిషేధంపై స్వచ్ఛంద సంస్థలు సైతం అప్పట్లో అవగాహన కల్పించినా.. ఇప్పుడు వాటి జాడ కూడా కానరాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో విజయనగరం నగరపాలక సంస్థతో పాటు రాజాం, బొబ్బిలి మున్సిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీతో పాటు అన్ని గ్రామాల్లోను ప్లాస్టిక్‌ సంచులు దర్శనమిస్తున్నాయి. గతంలో ప్లాస్టిక్‌ నిషేధానికి ఎన్నో చర్యలు తీసుకున్న అధికారులు తరువాత కాలక్రమేనా పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్‌ కవర్లు విచ్చలవిడిగా వినియోగంలోకి వచ్చాయి. ఈ క్రమంలో ప్లాస్టిక్‌ నిషేధంపై అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడం మానేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొరవడిన చిత్తశుద్ధి..

పాలిథిన్‌ నిషేధాన్ని అమలు చేస్తూ 2011లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు రెండేళ్ల పాటు పాలిథిన్‌ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వ్యాపారులపై దాడులు చేసి, అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయితే కాలానుగుణంగా మారిన అధికారులకు దీనిపై చిత్తశుద్ధి కొరవడడంతో మళ్లీ ప్లాస్టిక్‌, పాలిథిన్‌ రాజ్యమేలుతున్నాయి. ప్రధానంగా ప్రధాన పట్టణాలు, నగరాల్లో పాలిథిన్‌ కవర్ల వినియోగం ఎక్కువగా కనిపిస్తోంది. హోటళ్లు, తోపుడుబండ్లు, వీధి విక్రయదారులు, కూరగాయల వ్యాపారులు, కిరాణా షాపు యజమానులు, సూపర్‌ మార్కెట్‌లతో పాటు చికెన్‌, మటన్‌, చేపల విక్రయదారులు ఎక్కువగా పాలిథిన్‌ కవర్లను వినియోగిస్తున్నారు. హోల్‌సేల్‌ దుకాణాల వద్ద కూడా చాటుమాటుగా వీటి అమ్మకాలు చేపడుతున్నారు. అధికారులు ఎన్నిసార్లు దాడులు జరిపి, జరిమానా విధించినా షరా మామూలుగానే వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పాలిథిన్‌ నిషేధానికి తూట్లు పొడిచినట్లు అయింది. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుని, నిషేధాజ్ఞలు పక్కాగా అమలు చేయాలని పలువురు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



కవరుతో పండ్లు తీసుకువెళ్తున్న దృశ్యం

అంతటా ఇదే తీరు..

వాణిజ్య కేంద్రంగా విరాజిల్లుతున్న రాజాం పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రతీ వ్యాపారి పాలిథిన్‌ కవర్లు క్రయవిక్రయాలు కొనసాగిస్తున్నారు. పాలిథిన్‌ కవర్ల వినియోగం విచ్చలవిడిగా సాగిస్తున్నా, అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడంతో అధికారుల తీరుపై ఆయా ప్రాంతాల వాసులు పెదవి విరుస్తున్నారు. ప్లాస్టిక్‌ కవర్ల క్రయ,విక్రయాలపై అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడాన్ని జనం విమర్శిస్తున్నారు.



ఎక్కడికక్కడే పేరుకుపోతున్న పాలిథిన్‌ కవర్ల కుప్పలు

వాడకం వల్ల అనర్థాలివే..

పాలిథిన్‌ మట్టిలో కలవడానికి కొన్ని వందల ఏళ్లు పడుతుంది. ఈలోపు నేల, నీరు, పర్యావరణం కాలుష్యమవుతుంది. దీంతో వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుని, అనేక అనర్థాలు తలెత్తుతాయి.

1. వర్షపునీరు భూమిలో ఇంకిపోకుండా అడ్డుపడుతుంది.
2. పాలిథిన్‌ నేలసారాన్ని తగ్గిస్తాయి.
3. కాలువలో పేరుకుపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డుపడుతుంటాయి. దీంతో ఎక్కడకక్కడే మురుగునీరు స్తంభించిపోయి దోమలు పెరిగిపోతాయి.
4. మూగజీవాలు కవర్లలో ఉన్న వ్యర్థ పదార్థాలను కవర్లతో పాటు తినేయడం వల్ల అవి చనిపోతున్నాయి.

పరిష్కార మార్గాలివే..

1. పాలిథిన్‌ నిషేధంపై అధికారులు చిత్తశుద్ధి వహించి, చర్యలు తీసుకోవాలి.
2. స్వచ్ఛంద సంస్థలు సైతం ప్రజల్లో అవగాహన కల్పించాలి.
3. ఉత్పత్తిదారులపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలి.
4. అమ్మకందారులపై కేసులు నమోదు చేయాలి.
5. ప్రజలు కూడా చైతన్యం కావాలి

చర్యలు తీసుకుంటున్నాం..



రాజాం పట్టణంలో పాలిథిన్‌ నిషేధానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే దుకాణాల యజమానులకు ఆదేశాలు జారీ చేశాం. గతంలో మాదిరి ఎక్కడా పాలిథిన్‌ వాడకుండా చూస్తున్నాం. 120 మైక్రాన్ల కన్నా ఎక్కువ మందం ఉన్న పాలిథిన్‌నే వినియోగించాలి. అంతకంటే తక్కువ మందం ఉన్న వాటిని వాడకూడదు. వీటికి బదులు కాగితపు, జ్యూట్‌, గుడ్డ సంచులనే వాడేలా అవగాహన కల్పిస్తాం.

– డీటీవీ కృష్ణారావు, మున్సిపల్‌ కమిషనర్‌, రాజాం మున్సిపాలిటీ.

తారాపురంలో పండగ సందడి



అమ్మవార్ల ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు

రామభద్రపురం: గ్రామదేవతల ఉత్సవాల నేపథ్యంలో మండలంలోని తారాపురం గ్రామంలో పండగ సందడి నెలకొంది. గ్రామదేవతలైన చింతాలమ్మ, కొత్తమ్మ, బంగారమ్మ, టీకాలచ్చన్న, తారాదేవి అమ్మవార్ల పండగను ఈ నెల 5, 6, 7వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. దాదాపు 24 ఏళ్ల తర్వాత అమ్మవార్ల పండగ జరగడంతో వృత్తి, ఉపాధి, ఉద్యోగ రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా గ్రామస్తులు ఒక్కసారిగా ఊరికి చేరుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది. పండగకు మూడు వారాల ముందు అమ్మవార్లను గ్రామంలోకి తీసుకు వచ్చి, ఆ మూడు వారాల పాటు గ్రామంలో అమ్మవార్లను ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత మూడో వారంలో వచ్చే సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అమ్మవార్ల అనుపోత్సవం నిర్వహిస్తారు. సిరిమానోత్సవం రోజు కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శనలతో పాటు, బిందెల డ్యాన్స్‌, పులివేషాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు. 5వ తేదీన భాగవతం, 6వ తేదీన కండక్టర్‌ జాన్సీ, మాస్టర్‌ రమేష్‌ ట్రూప్‌తో మెగా డ్యాన్స్‌ ఈవెంట్‌, సత్యహరిశ్చంద్ర నాటకం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పండగకు దాదాపు రెండు లక్షల మంది వరకు భక్తులు వచ్చి, అమ్మవార్లను దర్శించుకుంటారని ఉత్సవ కమిటీ సభ్యులు చెబుతున్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 48 మంది ఎంపిక



కంటి పరీక్షల కోసం పేర్లు నమోదు చేయించుకుంటున్న వృద్ధులు

సంతకవిటి: వైఎస్సార్‌ కంటివెలుగు పథకంలో భాగంగా మండలంలోని మండవకురిటి గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీకాకుళం వారి సౌజన్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 48 మందికి నేత్ర శస్త్రచికిత్స అవసరమని గుర్తించి, ఆపరేషన్‌ కోసం శంకర్‌ ఫౌండేషన్‌ ఆస్పత్రికి తరలించినట్లు సర్పంచ్‌ బత్తుల జ్యోతీశ్వరరావు తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో తాగునీటి సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్‌ కమిషనర్‌ డీటీవీ కృష్ణారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు రేగిడి నాగావళి నది వద్ద ఉన్న ప్రధాన నీటి పంపింగ్‌ కేంద్రానికి విద్యుత్‌ సరఫరా నిలిచిపోయిందని, ఈ కారణంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

6న నవదుర్గ ఆలయ ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్‌ ఆవరణలోని నవదుర్గ ఆలయ ఆదాయాన్ని ఈ నెల 6వ తేదీన లెక్కించనున్నామని ఆలయ ఈఓ పి.శ్యామలరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీదారు, ఆలయ ధర్మకర్తల సమక్షంలో హుండీలు తెరిచి, లెక్కింపు చేపడతామన్నారు.

శతశాతం పెన్షన్ల పంపిణీ



బాడంగి: ఆస్పత్రిలోని రోగికి పెన్షన్‌ అందజేస్తున్న వలంటీర్‌ మహేష్‌

రేగిడి: మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీ శతశాతం పూర్తయినట్లు ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓ బాసూరి శంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 10,713 మంది లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా పెన్షన్‌ నగదు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్‌ అందజేత..

బాడంగి: విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పూడివలస గ్రామానికి చెందిన పూడి పెద్దగున్నంనాయుడుకు వలంటీర్‌ ఎస్‌.మహేష్‌ ఆదివారం పెన్షన్‌ అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి, మరీ పెన్షన్‌ అందజేయడం పట్ల రోగి బంధువులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.



వన్నలిలో దివ్యాంగునికి పెన్షన్‌ నగదు అందజేస్తున్న వలంటీర్‌

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- వేసవి శిక్షణ శిబిరంలో లైబ్రేరియన్‌ సత్యవాణి

రామభద్రపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, అందరూ గ్రంథాలయానికి వచ్చి, జ్ఞానం పెంపొందించుకోవాలని లైబ్రేరియన్‌ సత్యవాణి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు చదివించడం, చెప్పించడం, ఆటలు ఆడడం, పుస్తక పఠనం వంటి అంశాలపై ఆదివారం అవగాహన కల్పించారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలు, వార్తాపత్రికలు చదివిన ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారని ఆమె తెలిపారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ గ్రంథాయాలనికి రావొచ్చని, ఇక్కడి మంచిమంచి పుస్తకాలు చదివి, జ్ఞానం సముపార్జించుకోవాలన్నారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి..

బాడంగి: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సెల్‌ఫోన్‌ అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. మోటివేషనల్‌ స్పీకర్‌, గూగుల్‌ సర్టిఫైడ్‌ విద్యావేత్త, పింద్రంగివలస ప్రధానోపాధ్యాయుడు రవిబాబు సెల్‌ఫోన్‌ అతిగా వినియోగించడం వల్ల వచ్చే నష్టాలను పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా వివరించారు. సెలవులు, ఖాళీ సమయాల్లో చిన్నారులు, విద్యార్థులు, కొంతమంది పెద్దలు సెల్‌ఫోన్‌ ఎక్కువగా వాడుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని తెలిపారు. స్మార్ట్‌ఫోన్‌కు బానిసలైన వారిలో జ్ఞాపకశక్తి క్రమక్రమంగా తగ్గుతుందన్నారు. ఒక్కోసారి అంధత్వం కూడా వచ్చే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ఫోన్‌ వాడకం తగ్గించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లైబ్రేరియన్‌ ఆర్‌.దుర్గాప్రసాద్‌ పాల్గొన్నారు.



రామభద్రపురం: పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



బాడంగి: బాడంగి: పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా సెల్‌ఫోన్‌ వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రవిబాబు

వృత్తి నైపుణ్యంపై శిక్షణ..

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో పేపర్‌ క్రాఫ్ట్‌ తయారీ (రంగురంగుల కాగితాలతో బొమ్మలు తయారు చేయడం), వృత్తి నైపుణ్యంపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. తెర్లాం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రాఫ్ట్‌ ఉపాధ్యాయుడు కె.విస్సు, లైబ్రేరియన్‌ సీహెచ్‌.కృష్ణమూర్తి కలిసి, విద్యార్థులతో రంగురంగుల కాగితాలతో రకరకాల డిజైన్లు కలిగిన బొమ్మలను తయారు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు వృథాగా సమయాన్ని గడపడం కన్నా వృత్తి నైపుణ్యంపై దృష్టి సారించాలని వారు కోరారు.



తెర్లాం: పేపర్‌ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు విస్సు

కవిత్వంపై మక్కువ పెంచేలా రచనలు

బొబ్బిలి: తెలుగు కవిత్వంపై మక్కువ పెంచేలా రచనలు చేయాలని వక్తలు కోరారు. స్థానిక శ్రీ కళాభారతి మున్సిపల్‌ ఆడిటోరియంలో తెలుగు వెలుగు సాహిత్య వేదిక ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసే రచనలు చేయాలని, ముఖ్యంగా యువత సాహిత్యంపై ఇష్టం పెంచుకోవాలని సూచించారు. భావితరాలకు తెలుగు సాహిత్యం గొప్పతనం వివరించేలా, వారిలో స్ఫూర్తి నింపేలా మన రచనలు, కవిత్వం ఉండాలని తెలిపారు. అంతకుముందు కేక్‌ కట్‌ చేసి, ఆడిటోరియం ఆవరణలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎస్‌ఎన్‌ మూర్తి, చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ప్రతినిధి నంబియార్‌ వేణుగోపాలరావు, కవి మీసాల చినగౌరినాయుడు, గ్రీన్‌బెల్ట్‌ సొసైటీ సీఈఓ ఎస్‌వీ రమణమూర్తి, నటసమాఖ్య అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, తెలుగు వెలుగు కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, మొక్కుతున్న కవులు, సాహిత్యాభిమానులు

సంప్రదాయంగా ఏరువాక పౌర్ణమి



రాజాం సిటీ: పూజలు చేస్తున్న భక్తులు



రంగప్పవలసలో దుక్కి పనులు చేస్తున్న రైతులు

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ఆదివారం సంప్రదాయంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్‌ సీజన్‌కు ముందు రైతులంతా ఈ పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయాన్నే పొలానికి చేరుకున్న అన్నదాతలు ఎద్దులకు నాగలి కట్టి, పొలం దున్నారు. పంటలు బాగా పండాలని, రైతులంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామ నగిరేశ్వర స్వామి ఆలయంలో ఏరువాక పౌర్ణమి పూజలు ఆదివారం నిర్వహించారు. పురోహితులు ధూపం వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో మహిళలు పాల్గొని, హారతి సమర్పించి, ఏరువాక పౌర్ణమికి స్వాగతం పలికారు. ఏటా ఖరీఫ్‌ సాగుకు ముందు రైతులు సంప్రదాయంగా ఈ పండగను నిర్వహిస్తారు.

రాజాం సిటీ: సేంద్రియ ఎరువుల వాడకంతో ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని ప్రకృతి వ్యవసాయ రైతు పెంకి గౌరీశ్వరరావు తెలిపారు. ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని, స్థానిక అమ్మవారి కాలనీలోని పెరడులోని కూరగాయల మొక్కల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని, పసుపు, కుంకుమలతో పూజలు చేసి, ఈ ఏడాది పంటలు బాగా పండాలని కోరారు. కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: ఏరువాక పౌర్ణమికి హారతి సమర్పించి, స్వాగతం పలుకుతున్న మహిళలు

అపరిచిత వ్యక్తులకు ఓటీపీ చెప్పవద్దు

సంతకవిటి: అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్‌ కాల్‌కు ఓటీపీ చెప్పవద్దని ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు సూచించారు. ఆదివారం మండలంలోని జావాం గ్రామంలో విలేకరులతో మాట్లాడిన ఆయన దొంగతనాలు, సైబర్‌ నేరాలు జరుగుతున్న తీరు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వేసవి నేపథ్యంలో ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ఎక్కువ మంది ఆరుబయట, మేడలపై నిద్రిస్తున్నారని, అయితే ఇంటికి తాళాలు వేసుకుని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సచివాలయ మహిళా పోలీసులకు గానీ, పోలీస్‌స్టేషన్‌కు గానీ సమాచారం ఇవ్వాలని తెలిపారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

నేడు చిన్నయ్యపేటలో గడప గడపకు..

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న చిన్నయ్యపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్‌ వైస్‌ చైర్మన్‌ సిరిపురపు జగన్‌మోహన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆంద్రకు జ్వరమొచ్చింది..

- గ్రామంలో ప్రబలుతున్న విషజ్వరాలు
- మంచానబారిన పడుతున్న గ్రామస్తులు
- పారిశుద్ధ్య లోపంతోనే దుస్థితి

మెంటాడ: మండలంలోని ఆంద్ర, లోతుగెడ్డ గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన కుంచె పైడపునాయుడు, దాసరి రామునాయుడు, మారోతు కనకం, బండి రేవంత్‌కుమార్‌, సత్తరపు రాములమ్మ, తెమ్మ సింహాచలంతో పాటు మరికొంతమంది జ్వరం బారినపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం వల్లే ఈ దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధులు, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడం, కాలువల్లో పూడికలు విపరీతంగా ఉండిపోవడంతో ఆయా ప్రాంతాలు దోమలకు నిలయంగా మారాయి. దీంతో మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వస్తున్నాయని బాధితులు చెబుతున్నారు.

చల్లపేటలోనూ ఇదే పరిస్థితి..

మండలంలోని చల్లపేట ఆస్పత్రి పరిధిలోని కొండలింగాలవలస, తదితర గిరిజన గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. అక్కడి వారు కొంత మంది జ్వరం బారినపడి మంచానపడ్డారు. ఇటీవల మాజీ సర్పంచ్‌ సిరిపురపు నాగమణి, ఆమె కుమారుడు ఇద్దరూ ఒకేసారి జ్వరం బారినపడి, ఆస్పత్రిలో చికిత్స పొంది, శనివారం డిశ్చార్జ్‌ అయ్యారు. ఇదే విషయాన్ని వారే స్వయంగా వెల్లడించడం విశేషం.





జ్వరంతో బాధపడుతున్న సింహాచలం, రాములమ్మ

మెడికల్‌ క్యాంపు నిర్వహించాం..

ఆంద్ర, లోతుగెడ్డ గ్రామాల్లో దాదాపు 15 మంది వరకు జ్వరపీడితులు ఉండడం వాస్తమే. ఇప్పటికే మెడికల్‌ క్యాంపులు కూడా నిర్వహించి, వైద్యసేవలు అందించాం. ఫీవర్‌ సర్వే కూడా చేపట్టాం. ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బంది లేదు. –డాక్టర్‌ లోకప్రియా, మెంటాడ ఆస్పత్రి

తమకు సమాచారం లేదు..

ఆస్పత్రి పరిధిలోని గ్రామాల్లో జ్వరం బారినపడిన వారు ఉన్నట్లు తమకు ఇంతవరకు సమాచారం లేదు. ఎప్పటికప్పుడు ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్యసేవలు అందిస్తున్నాం.

–వైద్యుడు భాషా, చల్లపేట ఆస్పత్రి.

దుస్తుల పంపిణీ

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న నిరుపేదలకు మదర్‌ థెరీసా ట్రస్ట్‌ సీఈఓ క్లెవ్‌ కూపర్‌ ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్‌ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగానే వస్త్రాల పంపిణీ చేపట్టామని ఆయన తెలిపారు.